సంక్షిప్త స్కోర్లు:
లక్నో: 20 ఓవర్లలో 180/5 (మార్క్‌రమ్ 66, బదోని 50, హసరంగ 2/31, తుషార్ 1/26);
రాజస్థాన్: 20 ఓవర్లలో 178/5 (జైస్వాల్ 74, పరాగ్ 39, అవేశ్ ఖాన్ 3/37, మార్క్‌రమ్ 1/18)

జైస్వాల్ పోరాటం వృథా

లక్నోదే లక్

అవేశ్‌ఖాన్ అద్భుత ప్రదర్శన • రాజస్థాన్‌పై ఉత్కంఠ విజయం

జైపూర్: ఐపీఎల్‌లో మరో పోరు అభిమానులను ఊపేసింది. శనివారం డబుల్ హెడర్‌లో భాగంగా జరిగిన రెండో మ్యాచ్‌లో లక్నో సూపర్‌జెయింట్స్ 2 పరుగుల తేడాతో రాజస్థాన్ రాయల్స్‌పై ఉత్కంఠ విజయం సాధించింది. ఆఖరి ఓవర్‌లో విజయానికి 9 పరుగులు అవసరమైన దశలో లక్నో పేసర్ అవేశ్‌ఖాన్ అద్భుతం చేశాడు. హెట్‌మైర్(12)ను ఔట్ చేసిన అవేశ్ 6 పరుగులే ఇచ్చుకుని లక్నోకు అదిరిపోయే విజయాన్ని అందించాడు. దీంతో 181 పరుగుల లక్ష్యఛేదనలో రాజస్థాన్ 20 ఓవర్లలో 178/5 కు పరిమితమైంది. యశస్వీ జైస్వాల్ (52 బంతుల్లో 74, 5 ఫోర్లు, 4 సిక్సర్లు) సూపర్ ఫామ్‌ను కొనసాగించగా కెప్టెన్ రియాన్ పరాగ్ (39) మెరిశాడు. ఈ మ్యాచ్‌లో అరంగేట్రం చేసిన 14 ఏండ్ల చిన్నోడు వైభవ్ సూర్యవంశీ (20 బంతుల్లో 34, 2 ఫోర్లు, 3 సిక్సర్లు) ఐపీఎల్‌లో తన ఆగమనాన్ని ఘనంగా చాటాడు. మొదట బ్యాటింగ్ చేసిన లక్నో.. నిర్ణీత ఓవర్లలో 180/5 పరుగులు చేసింది. మార్క్‌రమ్ (45 బంతుల్లో 66, 5 ఫోర్లు, 3 సిక్సర్లు), అయుష్ బదోని (34 బంతుల్లో 50, 5 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు.

జైస్వాల్ జోరు

ఛేదనను రాజస్థాన్ ధాటిగా ఆరంభించింది. జైస్వాల్‌తో పాటు క్రీజులోకి వచ్చిన పాలబుగ్గల పసివాడు వైభవ్.. ఈ లీగ్‌లో తాను ఆడిన మొదటి బంతినే భారీ సిక్సర్ కొట్టాడు. శార్దూల్ వేసిన గుడ్ లెంగ్త్ బంతిని కవర్స్ దిశగా సిక్స్ బాదాడు. అవేశ్ బౌలింగ్‌లోనూ సిక్స్ కొట్టిన వైభవ్.. జైస్వాల్‌తో కలిసి తొలి వికెట్‌కు 8.4 ఓవర్లలో 85 పరుగులు జోడించి ఆ జట్టుకు శుభారంభాన్ని అందించాడు. శార్దూల్ 3వ ఓవర్లో 4 ,6తో బాదుడు మొదలుపెట్టిన జైస్వాల్.. మార్క్‌రమ్ ఓవర్లోనూ రెండు సిక్సర్లతో అలరించాడు. మార్క్‌రమ్ 9వ ఓవర్లో దురదృష్టవశాత్తూ వైభవ్ స్టంపౌట్‌గా వెనుదిరిగగా రాణా (8) సైతం నిరాశపరిచాడు. కానీ తాత్కాలిక సారథి పరాగ్‌తో జతకలిసిన జైస్వాల్.. లక్నోకు ఎలాంటి అవకాశమివ్వలేదు. 31 బంతుల్లోనే ఈ సీజన్‌లో వరుసగా మూడో హాఫ్ సెంచరీ చేశాడు. ఆఖర్లో అవేశ్.. జైస్వాల్, పరాగ్‌ను ఔట్ చేయడంతో పాటు చివరి ఓవర్‌లోనూ రాయల్స్‌ను కట్టడి చేస్తూ లక్నోకు విజయాన్ని కట్టబెట్టాడు. దీంతో వరుసగా నాలుగో మ్యాచ్‌లో ఓడిన రాయల్స్..ప్లేఆఫ్స్ అవకాశాలను మరింత క్లిష్టం చేసుకుంది.

ఆదుకున్న మార్క్‌రమ్, బదోని

టాపార్డర్ బ్యాటర్లు విఫలమవడంతో లక్నో ఆరంభ ఓవర్లలోనే కష్టాల్లో పడింది. జోరు మీదున్న మిచెల్ మార్ష్ (4)ను మూడో ఓవర్లోనే ఆర్చర్ పెవిలియన్‌కు పంపి రాయల్స్‌కు తొలి బ్రేక్‌నిచ్చాడు. ఆరెంజ్ క్యాప్ వీరుడు నికోలస్ పూరన్ (11)ను సందీప్ శర్మ వికెట్ల ముందు బలిగొనగా కెప్టెన్ పంత్ (3) వైఫల్య ప్రదర్శన దిగ్విజయంగా కొనసాగింది. 54 పరుగులకే 3 వికెట్లు కోల్పోయిన దశలో లక్నోను మార్క్‌రమ్, బదోని ఆదుకున్నారు. ఈ ఇద్దరూ నాలుగో వికెట్‌కు 76 రన్స్ జోడించారు. 31 బంతుల్లో మార్క్‌రమ్ అర్ధశతకాన్ని పూర్తిచేశాక బ్యాట్ ఝుళిపించాడు. మరో ఎండ్‌లో బదోని కూడా వేగంగా ఆడాడు. అయితే ఈ ఇద్దరూ స్వల్ప వ్యవధిలో నిష్క్రమించినా.. ఆఖర్లో అబ్దుల్ సమద్ (10 బంతుల్లో 30 నాటౌట్, 4 సిక్సర్లు) మెరుపులతో లక్నో పోరాడగలిగే స్కోరును సాధించింది.

ఫైనల్‌కు అన్వత్, వీర్

కౌలాలంపూర్ (మలేషియా): స్క్వాష్ వరల్డ్ చాంపియన్‌షిప్స్ ఆసియా క్వాలిఫయింగ్ ఈవెంట్‌లో భారత్‌కు చెందిన అన్వత్ సింగ్, వీర్ చొత్రాని ఫైనల్‌కు దూసుకెళ్లారు. శనివారం జరిగిన మహిళల సింగిల్స్ సెమీస్ పోరులో ఐదో సీడ్ అన్వత్.. 3-0తో హెలెన్ టాంగ్ (హాంకాంగ్)ను మట్టికరిపించి ఫైనల్‌కు చేరింది. పురుషుల సింగిల్స్ సెమీస్‌లో వీర్ 3-1 తో హిమ్ వాంగ్ (హాంకాంగ్)ను ఓడించాడు. మరో సెమీస్‌లో ఆకాంక్ష 1-3తో టోబి సె (హాంకాంగ్) చేతిలో ఓడింది.

కేకేఆర్‌లోకి నాయర్ రీఎంట్రీ

కోల్‌కతా: మూడు రోజుల క్రితం టీమ్ ఇండియా కోచింగ్ బృందం నుంచి వైదొలిగిన అభిషేక్ నాయర్.. తిరిగి కోల్‌కతా నైట్‌రైడర్స్ (కేకేఆర్)తో చేరాడు. 2018 నుంచి గత సీజన్ వరకూ అభిషేక్.. కేకేఆర్ కోచింగ్ స్టాఫ్‌లో భాగంగా ఉన్న విషయం విదితమే. 2024లో టీమ్‌ఇండియా అసిస్టెంట్ కోచ్‌గా నియమితుడైన నాయర్.. టెస్టులలో భారత జట్టు వైఫల్యాలతో బీసీసీఐ అతడిపై వేటు వేసింది. కోచింగ్ బృందం నుంచి తీసేసిన మూడు రోజుల తర్వాత అతడు మళ్లీ కేకేఆర్‌తో చేరడం గమనార్హం.

203 ఉఫ్

ఢిల్లీపై గుజరాత్ అలవోక విజయం • బౌలింగ్ వైఫల్యంతో తేలిపోయిన క్యాపిటల్స్

అహ్మదాబాద్: ఈ సీజన్‌లో వరుస విజయాలతో దూసుకుపోతున్న గుజరాత్ టైటాన్స్ (జీటీ).. సొంతగడ్డపై మరో భారీ విజయాన్ని నమోదుచేసింది. శనివారం అహ్మదాబాద్ వేదికగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ప్రత్యర్థిని 7 వికెట్ల తేడాతో ఓడించింది. జోస్ బట్లర్ (54 బంతుల్లో 97 నాటౌట్, 11 ఫోర్లు, 4 సిక్సర్లు), షెర్ఫేన్ రూథర్‌ఫర్డ్ (34 బంతుల్లో 43, 1 ఫోర్, 3 సిక్సర్లు) రాణించడంతో ఢిల్లీ నిర్దేశించిన 204 పరుగుల లక్ష్యాన్ని టైటాన్స్.. మరో 4 బంతులు మిగిలుండగానే ఊదేసింది. మొదట బ్యాటింగ్ చేసిన క్యాపిటల్స్‌కు బ్యాటర్లు సమిష్టిగా రాణించినా ఒక్కరూ అర్ధసెంచరీ మార్కును దాటలేకపోయారు. కెప్టెన్ అక్షర్ పటేల్ (32 బంతుల్లో 39, 1 ఫోర్, 2 సిక్సర్లు) టాప్ స్కోరర్ కాగా అశుతోశ్ (19 బంతుల్లో 37, 2 ఫోర్లు, 3 సిక్సర్లు), కరుణ్ నాయర్ (31), స్టబ్స్ (31) రాణించారు. గుజరాత్ బౌలర్లలో ప్రసిద్ధ్ (4/41) నాలుగు కీలక వికెట్లు పడగొట్టాడు. బట్లర్‌కే 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది.

బట్లర్ బాదగా..

భారీ ఛేదనలో రెండో ఓవర్‌లోనే టైటాన్స్.. కరుణ్ అద్భుత త్రో తో సారథి శుభ్‌మన్ గిల్ (7) వికెట్‌ను కోల్పోయింది. మూడో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చిన బట్లర్.. తొలుత సుదర్శన్ (36), తర్వాత రూథర్‌ఫర్డ్‌తో కీలక భాగస్వామ్యాలు నెలకొల్పి గుజరాత్‌కు అలవోక విజయాన్ని అందించాడు. స్టార్క్ 3వ ఓవర్లో రెండు చూడముచ్చటైన బౌండరీలు రాబట్టిన సుదర్శన్.. అక్షర్‌కు సిక్సర్‌తో స్వాగతం పలికాడు. ఎదుర్కొన్న రెండో బంతినే బౌండరీగా మలిచిన బట్లర్ కూడా విప్రాజ్ నిగమ్ ఐదో ఓవర్లో రెండు భారీ సిక్సర్లు కొట్టాడు. కుల్‌దీప్.. 8వ ఓవర్లో సుదర్శన్‌ను ఔట్ చేయడంతో ఇంపాక్ట్ ప్లేయర్‌గా రూథర్‌ఫర్డ్ క్రీజులోకి వచ్చాడు. ఈ ఇద్దరూ రన్‌రేట్‌ను కాపాడుకుంటూనే క్రీజులో కుదురుకున్నాక బ్యాట్ ఝుళిపించారు. మోహిత్ బౌలింగ్‌లో రూథర్‌ఫర్డ్.. 6, 6తో రెచ్చిపోయాడు. 34 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్న బట్లర్.. స్టార్క్ 15వ ఓవర్లో వరుసగా ఐదు బౌండరీలతో అరుసుకోవడంతో మ్యాచ్‌పై ఢిల్లీ ఆశలు కోల్పోయింది. టైటాన్స్ విజయానికి 8 పరుగుల దూరంలో ఉండగా రూథర్‌ఫర్డ్ నిష్క్రమించినా తెవాటియా (11 నాటౌట్)తో కలిసి బట్లర్ లాంఛనాన్ని పూర్తి చేశాడు.

సమిష్టిగా రాణించినా..

అంతకుముందు ఢిల్లీ ఇన్నింగ్స్‌లో క్రీజులోకి వచ్చిన బ్యాటర్లంతా మెరుపులు మెరిపించినా ఒక్కరూ భారీ స్కోర్లు చేయలేకపోయారు. ఈ సీజన్‌లో వరుసగా విఫలమవుతున్న జేక్ ఫ్రేజర్‌ను ఈ మ్యాచ్‌లో పక్కనబెట్టిన ఢిల్లీ.. అభిషేక్ పొరెల్ (18)కు జోడీగా కరుణ్‌ను పంపించింది. సిరాజ్ తొలి ఓవర్లోనే 4, 6, 4తో పొరెల్ దూకుడుగా ఇన్నింగ్స్‌ను ఆరంభించినా అర్షద్ ఖాన్ రెండో ఓవర్లో సిరాజ్‌కు క్యాచ్ ఇచ్చాడు. మూడో స్థానంలో క్రీజులోకి వచ్చిన రాహుల్ (28).. 4, 6, 4, 4తో ఉన్నంతసేపు ధాటిగానే ఆడాడు. కరుణ్ సైతం రెండు బౌండరీలు, రెండు సిక్సర్లతో జోరు కనబరిచాడు. కానీ ప్రసిద్ధ్.. రాహుల్‌తో పాటు కరుణ్‌నూ పెవిలియన్‌కు చేర్చాడు. వీరి స్థానాల్లో వచ్చిన అక్షర్, స్టబ్స్ కాస్త నెమ్మదించినా రన్‌రేట్ పడిపోకుండా చూసుకున్నారు. ఆఖర్లో అశుతోశ్ మెరుపులతో ఢిల్లీ 200 రన్స్ మార్కును దాటింది.

సంక్షిప్త స్కోర్లు
ఢిల్లీ: 203/8 (అక్షర్ 39, అశుతోశ్ 37, ప్రసిద్ధ్ 4/41, ఇషాంత్ 1/19);**గుజరాత్:** 19.2 ఓవర్లలో 204/3 (బట్లర్ 97*, రూథర్‌ఫర్డ్ 43, కుల్‌దీప్ 1/30, ముకేశ్ 1/40)

పాయింట్ల పట్టిక

జ	మ్యా	గె	ఓ	పా	ర.రే
గుజరాత్	7	5	2	10	0.98
ఢిల్లీ	7	5	2	10	0.58
పంజాబ్	7	5	2	10	0.30
లక్నో	8	5	3	10	0.08
బెంగళూరు	7	4	3	8	0.44
కోల్‌కతా	7	3	4	6	0.54
ముంబై	7	3	4	6	0.23
రాజస్థాన్	8	2	6	4	-0.63
హైదరాబాద్	7	2	5	4	-1.21
చెన్నై	7	2	5	4	-1.27

నోట్: జ- జట్టు, మ్యా. మ్యాచ్, గె-గెలుపు, ఓ-ఓటమి, పా-పాయింట్లు, ర.రే-రన్‌రేట్

అజర్ స్టాండ్‌కు తెర

హెచ్‌సీఏ అంబుడ్స్‌మన్ ఆదేశాలు
టికెట్లపై పేరు కూడా ముద్రించవద్దంటూ తీర్పు

హైదరాబాద్, ఆట ప్రతినిధి: భారత మాజీ కెప్టెన్, హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) మాజీ అధ్యక్షుడు మహమ్మద్ అజారుద్దీన్‌కు ఎదురుదెబ్బ తగిలింది. స్థానిక ఉప్పల్ రాజీవ్‌గాంధీ స్టేడియంలో నార్త్‌స్టాండ్‌కు ఉన్న అజర్ పేరును తొలిగిస్తూ హెచ్‌సీఏ ఎథిక్స్ ఆఫీసర్, అంబుడ్స్‌మన్ జస్టిస్ ఈశ్వరయ్య శనివారం ఆదేశాలు జారీ చేశారు. లార్డ్స్ క్రికెట్ క్లబ్ దాఖలు చేసిన పిటీషన్‌ను విచారించిన జస్టిస్ ఈశ్వరయ్య..తాజా తీర్పు వెలువరించారు. 2019లో హెచ్‌సీఏ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ఎవరిని సంప్రదించకుండా ఏకపక్షంగా నార్త్‌స్టాండ్‌కు అజర్ తన పేరు పెట్టుకున్నాడు. అపెక్స్ కౌన్సిల్ ఆమోదం లేకుండా తీసుకున్న ఈ నిర్ణయాన్ని పరస్పర విరుద్ధ ప్రయోజనాలకు పాల్పడినట్లు తేలడంతో హెచ్‌సీఏ అంబుడ్స్‌మన్ జస్టిస్ ఈశ్వరయ్య పేరు తొలిగింపునకు ఆదేశాలు జారీ చేశారు. దీనికి తోడు ఇకపై ముద్రించే మ్యాచ్ టికెట్లపై కూడా అజర్ పేరు ఉండకూడదు అంటూ ఆయన స్పష్టంగా పేర్కొన్నారు. ఇదిలా ఉంటే గతంలో ఇదే నార్త్‌స్టాండ్‌కు మాజీ క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్ పేరును కొనసాగించాలని పిటీషనర్ తన పిల్‌లో కోరారు. అయితే దీనిపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. అంబుడ్స్‌మన్ తాజా నిర్ణయంతో ఉప్పల్ స్టేడియంలో అజర్ స్టాండ్‌కు తెరపడనుంది.

బ్రిడ్జ్‌లో భారత్ క్లీన్ స్వీప్

ఢిల్లీ: దుబాయ్‌లో జరిగిన బ్రిడ్జ్ ఫెడరేషన్ ఆఫ్ ఆసియా అండ్ మిడిల్ ఈస్ట్ టోర్నమెంట్‌ను భారత్ క్లీన్‌స్వీప్ చేసింది. ఈనెల 10 నుంచి 18 దాకా జరిగిన టోర్నీలో భాగంగా.. భారత పురుషుల, మహిళల, సీనియర్ జట్టు స్వర్ణాలతో సత్తాచాటగా మిక్స్‌డ్ టీమ్ రజతం గెలిచింది. ఈ విజయంతో నాలుగు జట్లు.. ఈ ఏడాది ఆగస్టులో జరిగే 47వ బ్రిడ్జ్ చాంపియన్‌షిప్స్‌నకు అర్హత సాధించాయి.

హిమాన్షుకు స్వర్ణం

అండర్-18 అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్‌లో భారత్‌కు తొలి పసిడి

ఢిల్లీ: సౌదీ అరేబియాలోని దమామ్ వేదికగా జరిగిన అండర్-18 ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్‌లో చివరి రోజు భారత్‌కు తొలి స్వర్ణం దక్కింది. జావెలిన్ త్రోలో హిమాన్షు.. దేశానికి తొలి పసిడిని అందించాడు. డబుల్ ఒలింపిక్ మెడలిస్ట్ నీరజ్ చోప్రాను అమితంగా అభిమానించే 17 ఏండ్ల ఈ హర్యానా కుర్రాడు.. 67.57 మీటర్ల త్రోతో బంగారు పతకం సాధించాడు. టోర్నీ ఆఖరిరోజైన శనివారం భారత్‌కు హిమాన్షు స్వర్ణంతో పాటు మరో మూడు పతకాలు దక్కాయి. పురుషుల హైజంప్‌లో దేవాక్ రజతం గెలవగా మహిళల 200 మీటర్ల రేసులో ఆర్తికి కాంస్యం, మెన్స్ మెడ్లీ రిలే జట్టు సిల్వర్‌తో మెరిసింది. ఒక స్వర్ణం, ఐదు రజతాలు, ఐదు కాంస్యాలతో (మొత్తం 11) భారత్ ఈ టోర్నీని ఘనంగా ముగించింది.

ర్యాంకులకు కేరాఫ్ 'నారాయణ'

- జేఈఈ మెయిన్ ఫలితాల్లో నారాయణ విజయ దుందుభి
- ఓపెన్ క్యాటగిరీలో 100లోపు 25, 1000లోపు 165 ర్యాంకులు
- 10 రాష్ట్రాల్లో నారాయణ విద్యార్థులే స్టేట్ టాపర్స్
- విలేకరుల సమావేశంలో నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్ల వెల్లడి

హైదరాబాద్ ఏప్రిల్19, (నమస్తే తెలంగాణ): జేఈఈ-మెయిన్ 2025 ఫలితాల్లో టాప్ ర్యాంకులతో నారాయణ విద్యార్థులు సత్తాచాటారని నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్స్ డాక్టర్ పీ సింధూరనారాయణ, పీ శరణి నారాయణ, రమా నారాయణ అన్నారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. ఆలిండియా ఓపెన్ క్యాటగిరీలో 1, 9, 10 లోపు అత్యుత్తమ ర్యాంకులు సాధించారని పేర్కొన్నారు. ఆలిండియా ఓపెన్ క్యాటగిరీలో బనిబ్రత మాజీ (హెచ్‌టీ నెం. 250310746461) 1వ ర్యాంకు, టీ శివన్ వికాస్ (హెచ్‌టీ నెం. 250310391420) 9వ ర్యాంకు, సౌరబ్ (హెచ్‌టీ నెం. 250310254844) 12వ ర్యాంకు, ఆర్చి స్మాన్ నంది (హెచ్‌టీ నెం. 250310013515)13వ ర్యాంకు, సన్నధ్య షరాఫ్ (హెచ్‌టీ నెం. 250310296087) 19వ ర్యాంకు, ఆయుష్ సింఘాల్ (హెచ్‌టీ నెం. 250310009213)20వ ర్యాంకు కైవసం చేసుకున్నారని వివరించారు. అలాగే ఆలిండియా ఓపెన్ క్యాటగిరీలో 1,9, 12,19,20,21,22,24,25,26,36,36,45,47,59,60,67,67,80,81,86,87,95 వంటి టాప్ ర్యాంకులతోపాటు 1000లోపు 165 ర్యాంకులతో నారాయణ విజయ దుందుభి మోగించినట్టు తెలిపారు. గత ఆరేండ్లుగా ఓపెన్ క్యాటగిరీలో మూడుసార్లు (2020,2021,2025) ఆలిండియా ఫస్ట్ ర్యాంకు సాధించడం నారాయణ కమిట్‌మెంట్‌కు నిదర్శనమని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 100 పర్సంటైల్ సాధించిన వారు 24 మంది ఉండగా, వారిలో 8మంది (33%) నారాయణ విద్యార్థులు కావడం గర్వకారణమని అన్నారు. 10 రాష్ట్రాల్లో నారాయణ విద్యార్థులే టాపర్స్‌గా నిలవడం నారాయణ ఘనతకు నిదర్శనమని పేర్కొన్నారు. జేఈఈ మెయిన్ కలలను సాకారం చేయడంలో వేరెవ్వరూ నారాయణకు సాటిలేరని, పోటీరారని మరోసారి నిరూపించారని అన్నారు. దేశవ్యాప్తంగా సుమారు 14.75 లక్షలమంది విద్యార్థులు జేఈఈ మెయిన్ పరీక్ష రాయగా, వీరిలో సామాజిక వర్గాలవారీగా, రిజర్వేషన్లకు అనుగుణంగా కేవలం 2.50 లక్షల మంది విద్యార్థులకు మాత్రమే జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షకు అర్హత కల్పిస్తారని తెలిపారు. ఈ పరీక్షా ఫలితాల్లో అత్యధిక సంఖ్యలో నారాయణ విద్యార్థులు విజయం సాధించడం ఆనందంగా ఉందని అన్నారు. నారాయణ అందించే అనితరసాధ్యమైన శిక్షణ, రీసెర్చ్ ఓరియంటెడ్ ప్రోగ్రామ్, పటిష్ట ప్రణాళిక, స్టడీ మెటీరియల్, నిబద్ధతతో కూడిన వారంతపు పరీక్ష వల్లే ఈ ఘనత సాధ్యమైందని తేల్చిచెప్పారు. ఆన్‌లైన్ ఎగ్జామ్స్ కోసం ప్రత్యేకంగా ఎన్-లెర్న్ యాప్‌ను రూపొందించడం జరిగిందని వివరించారు. వీటి ద్వారా ప్రతీ క్యాంపస్‌లో ప్రత్యేకంగా కంప్యూటర్ ల్యాబ్స్‌ను తీర్చిదిద్దినట్టు పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 300/300 మార్కులు సాధించిన విద్యార్థుల్లో ఒకరు తెలుగు రాష్ట్రాలకు చెందిన నారాయణ విద్యార్థి కావడం అభినందనీయమని అన్నారు. అందుకే ఐఐటీకి కేరాఫ్ అడ్రస్ నారాయణే అని నిరూపించామని తెలిపారు. ఇంతటి ఘన విజయం సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అధ్యాపక బృందానికి అభినందనలు తెలియజేస్తున్నామని అన్నారు.

'గౌతమ్' పూర్వ విద్యార్థుల ఘన విజయం

హైదరాబాద్ ఏప్రిల్ 19, (నమస్తే తెలంగాణ): జేఈఈ మెయిన్స్-2025 ఫలితాల్లో డాక్టర్ కేకేఆర్ గౌతమ్ స్కూల్ పూర్వ విద్యార్థులు వివిధ క్యాటగిరీల్లో 100లోపు 9 ర్యాంకులు సాధించినట్టు ప్రిన్సిపల్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్ హేమంత్ అభిరామ్ ఆలిండియా 18వ ర్యాంకు, వై జశ్వంత్ చౌదరి 22వ ర్యాంకు, ఎల్ చర్విత 22వ ర్యాంకు సాధించినట్టు పేర్కొన్నారు. అలాగే 100లోపు వివిధ క్యాటగిరీలలో 18,22,22,26,31,34,53,60,74 వంటి 9ర్యాంకులు సాధించడం గర్వంగా ఉన్నదని అన్నారు. ఇంతటి విజయాన్ని సాధించిన విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, సంస్థ యాజమాన్యానికి అభినందనలు తెలియజేశారు.

జేఈఈలో గురుకుల విద్యార్థుల ప్రతిభ

- ఎస్సీ సొసైటీ నుంచి 525 మందికి అధిక మార్కులు
- ఎంజేపీ సొసైటీ నుంచి 63మంది క్వాలిఫై

హైదరాబాద్, ఏప్రిల్19 (నమస్తే తెలంగాణ): జేఈఈ మెయిన్ ఫలితాల్లో తెలంగాణ గురుకుల విద్యార్థులు సత్తా చాటారు. మొత్తంగా 588 మంది విద్యార్థులు అత్యధిక పర్సంటైల్ సాధించి అర్హత సాధించారు. 525 మంది 61 పర్సంటైల్ కంటే అధిక మార్కులు సాధించారు. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ నుంచి 525 మంది విద్యార్థులు 61 పర్సంటైల్ కంటే అధికంగా మార్కులు సాధించి అర్హత సాధించారు. 90కు పైగా పర్సంటైల్ 40మంది, 80కు పైగా పర్సంటైల్ 164మంది విద్యార్థులు సాధించడం విశేషం. బీసీ గురుకులం నుంచి కూడా 90కిపైగా పర్సంటైల్‌ను 9మంది విద్యార్థులు సాధించగా, 63 మంది విద్యార్థులు మెయిన్‌కు క్వాలిఫై అయ్యారు. మంత్రి పొన్నం ప్రభాకర్, బీసీ, ఎస్సీ గురుకుల సొసైటీల కార్యదర్శులు సైదులు, అలుగు వర్షిణి అభినందించారు.

జేఈఈలో శ్రీచైతన్య ప్రభంజనం

- ఆలిండియా ఓపెన్ క్యాటగిరీలో రెండు ఫస్ట్ ర్యాంకులు చైతన్యవే
- విలేకరుల సమావేశంలో అకడమిక్ డైరెక్టర్ సుష్మశ్రీ వెల్లడి

హైదరాబాద్, ఏప్రిల్19 (నమస్తే తెలంగాణ): జేఈఈ మెయిన్ -2025 ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థులు రికార్డు సృష్టించారని శ్రీచైతన్య విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మశ్రీ తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఒక్క తెలుగు రాష్ట్రాల నుంచే 300/300 మార్కులతో ఆలిండియా ఓపెన్ క్యాటగిరీలో 1వ ర్యాంకు వంగా అజయ్‌రెడ్డి (హెచ్‌టీ నెం. 250310255592)తోపాటు, దేవ్‌దత్తా మాఝీ (హెచ్‌టీ నెం. 250310016185 డీఎల్‌పీ) 1వ ర్యాంకు, టీ శివన్ (హెచ్‌టీ నెం. 250310391420 డీఎల్‌పీ) 9వ ర్యాంకు ఎస్ జిందల్ (హెచ్‌టీ నెం. 250310236696 డీఎల్‌పీ) 10వ ర్యాంకుతో టాప్ 10లో 4 ర్యాంకులు, 100లోపు 27 ర్యాంకులు, 1000లోపు 150పైగా ర్యాంకులు సాధించారని వివరించారు. గత మూడేండ్లలో తెలుగు రాష్ట్రాల నుంచి 300/300 మార్కులు సాధిస్తూ హ్యాట్రిక్ రికార్డు సృష్టించడం శ్రీచైతన్యకే సాధ్యమైందని అన్నారు. ఒకే సంవత్సరంలో మూడు జాతీయస్థాయి పోటీ పరీక్షల్లో ఓపెన్ క్యాటగిరీలో మూడు ఆలిండియా ఫస్ట్ ర్యాంకులతో హ్యాట్రిక్ సాధించిన ఘనత కూడా శ్రీచైతన్యదేనని చెప్పారు. ఇంతటి ఘన విజయాలకు కారణమైన శ్రీచైతన్య అనితరసాధ్యమైన ప్రోగ్రామ్‌లు, మైక్రో షెడ్యూల్స్, ఇంటర్నల్ ఎగ్జామ్స్, ర్యాంకింగ్స్ సిస్టమ్, ఇన్ఫినిటీ లెర్న్ ఆన్‌లైన్ యాప్, నిరంతరం శ్రమించే టాప్ ఫ్యాకల్టీ వల్లే ఇది సాధ్యమైందని ఆమె హర్షం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, అధ్యాపక బృందానికి అభినందనలు తెలియజేశారు.

జేఈఈలో అల్ఫోర్స్‌కు ర్యాంకుల పంట

విలేకరుల సమావేశంలో విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ వీ నరేందర్‌రెడ్డి

కరీంనగర్ కమాన్‌చౌరస్తా, ఏప్రిల్ 19: ఐఐటీ జేఈఈ మెయిన్స్-2025లో అల్ఫోర్స్ విద్యాసంస్థల విద్యార్థులు ర్యాంకులు పంట పండించారని విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వీ నరేందర్‌రెడ్డి తెలిపారు. శనివారం కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఏడాది ఐఐటీ నీట్ పోటీ పరీక్షల్లో అల్ఫోర్స్ విద్యార్థులు రాణిస్తున్నందుకు సంతోషంగా ఉన్నదని అన్నారు. కళాశాలకు చెందిన ఎన్ శరణ్య 49వ ర్యాంకుతో అత్యున్నత స్థానంలో నిలువగా, పీ శ్రీహర్ష 244వ ర్యాంకు, ఎన్ అనిరుద్ సాయి 272, డీ విశాల్ 329, జే వామిక 350, టీ ప్రణతి 456, అంకిత్సాయి 574, బీ ఆదిత్య 630, టీ శివాత్మిక 646, వీ హృషీకేశ్ 703, మహ్మద్ అబ్దులాక్ 968, పవార్ తేజ్‌పాల్ 1056, అక్షిత 1148, డీ విశాల్ 1270, ధమష్ 1298, అనురుద్ 1343, శివాని 1378, అర్ సుమిత్‌కుమార్ 1637, డీ కార్తీక్‌రెడ్డి 1826, మహ్మద్ అబ్దుల్ జీవషన్ 1989, బీ విష్ణు 2000వ ర్యాంకులు సాధించి అల్ఫోర్స్ కీర్తిని మరింత ఇనుమడింపజేసినట్టు చెప్పారు. 1000లోపు 11ర్యాంకులు, 2000లోపు 21ర్యాంకులు, 5000లోపు 40 ర్యాంకులు సాధించగా, 459 మంది విద్యార్థులు ఐఐటీ అడ్వాన్స్‌కు అర్హత సాధించడం గొప్ప విషయమని తెలిపారు. ఐఐటీ అడ్వాన్స్‌డ్‌లో పరీక్ష రాసేందుకు ఎంపికైన విద్యార్థులకు అత్యుత్తమ అధ్యాపక బృందంతో శిక్షణ ఇవ్వనున్నట్టు వివరించారు. పటిష్ట ప్రణాళికతో విద్యాబోధన, నిరంతర పర్యవేక్షణ, విద్యార్థుల పట్టుదల, అహర్నిశ కృషితోనే ఇంతటి ఘన విజయం సాధించగలిగిందని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపక బృందానికి ఆయన అభినందనలు తెలియజేశారు. ఈ సమావేశంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాగసిద్ధార్థ | పాటిల్ సాక్షి | ఎం అరుణ్ | రవిచంద్ర | భరణ